
సాక్షి విజయనగరం

ఆదివారం । 6 । జూలై । 2025



పెంపకం.. కావాలి అప్రమత్తం..!
మానవ జీవనంలో జంతువులు సైతం భాగమయ్యాయి. వీటి పెంపకంలో ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. - 8లో



ఏం కష్టం వచ్చిందో..
ఏం కష్టం వచ్చిందో తెలియదుకానీ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. - 8లో



పీడీఎస్ బియ్యం పట్టివేత
అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులు మెరుపుదాడితో పట్టుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

మూతపడిన మరో బడి



మూతపడిన అన్నమరాజపురం పాఠశాల

సంతకవిటి: కూటమి ప్రభుత్వ పాలనలో ఒక్కోపాఠశాల మూతపడుతోంది. ఇటీవల ఫౌండేషన్ స్కూల్‌గా మార్చిన సంతకవిటి మండంలోని గుజ్జన్నపేట పాఠశాల మూతబడింది. ఇప్పుడు అన్నమరాజపురం ప్రాథమిక పాఠశాలలో పిల్లలు లేకపోవడంతో శనివారం మూసివేశారు. ఇక్కడ ఇంతవరకు చదుతున్న ముగ్గురు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరిపోవడంతో ప్రభుత్వబడి మూతబడింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బంకి వెంకటప్పలనాయుడును చినముకుందాపురం పాఠశాలకు డిప్యుటేషన్ వేసినట్టు ఎంఈఓ బి.శాంతకుమారి తెలిపారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి

విజయనగరం: మహారాష్ట్రలో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అండర్–10, 12 వయస్సు విభాగాల్లో తలపడేందుకు ఏపీ జట్టుకు ఎంపికైన దేశిక్, జాయ్ జబేజ్, హసీనా, శ్రీవల్లి శనివారం బయలుదేరారు. క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వర రావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మీ.. క్షమించు తల్లీ..!

- వ్యర్థాలు ఉండే ప్రదేశంలో భక్తుల ముడుపులు
- అమ్మవారి దేవస్థానం సమీపంలో ఘటన
- ఆవేదనలో భక్తజనం



అమ్మవారి దేవస్థానం సమీపంలో వ్యర్థాల ప్రదేశంలో భక్తులు చెల్లించుకున్న ముడుపులు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో మహా అపచారం సంఘటన చోటు చేసుకుంది. భక్తులు ఎంతో నమ్మకంతో ముడుపులు కట్టి వాటిని అమ్మవారికి చెల్లించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అలా దేవస్థానాల్లో ఉండాల్సిన ముడుపులు వ్యర్థాలు ఉండే ప్రదేశంలో దర్శనమివ్వడం మహా అపచారమంటూ భక్తులు వాపోతున్నారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వైపు శనివారం సాయంత్రం నడకకోసం వెళ్లిన కొంతమందికి ఈ ఘటన దర్శనమిచ్చింది. వ్యర్థాలు ఉండాల్సిన ప్రదేశంలో ముడుపులు కుప్పలుగా పడి ఉండడాన్ని చూసి వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. కూటమి ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దం పడుతోందని భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలం తీరిన తరువాత ముడుపులను చెరువులు, సముద్రం, నదుల్లో కలపాలే తప్ప ఇలా బహిరంగ మూత్ర ప్రదేశాలు వద్ద పడేయడం దారుణమని, సనాతన ధర్మం అంటూ సమావేశాల్లో కూటమి నేతల మాటలు కేవలం ప్రచారానికేనా అంటూ విమర్శిస్తున్నారు.



రెన్యువల్, జీతాల కోసం రెండు రోజుల కింద విజయనగరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్ల ఆకలి కేకలు

- మూడు నెలలుగా అందని జీతం
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- జీతాలు చెల్లించాలంటూ ఆందోళన
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విజయనగరం ఫోర్ట్:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) ఆకలితో అలమటిస్తున్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగాల కొనసాగింపు ఉత్తర్వులు జారీ చేయడంలో కూటమి ప్రభుత్వ జాప్యం వీరికి శాపంగా మారింది. పలు మార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం వీరి సమస్య పరిష్కారానికి చొరవచూపడం లేదు. ఫలితం వందలాది మంది ఉద్యోగాలు ప్రశ్నార్థకంగా మారాయి.

● ‘ఉపాధి’పై చిన్నచూపు

జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో ఫీల్డు అసిస్టెంట్లుగా జిల్లాలో 776 మంది పనిచేస్తున్నారు. అయితే వీరి సర్వీసును ఏటా రెన్యూవల్ చేయాలి. అలా చేస్తేనే వారికి జీతాలు వస్తాయి. జూలై నెల వచ్చినా వారికి కొనసాగింపు ఉత్తర్వులు రాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దీనివల్ల ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు అందని పరిస్థితి. రెన్యూవల్ ఉత్తర్వులు జారీచేయడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు. ఉపాధిహామీ వేతనదారులకు సైతం వేతన బకాయిల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని, లక్షలాదిమందికి ‘ఉపాధి’చూపే పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదంటున్నారు.

● వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు..

విద్యా సంవత్సరం ప్రారంభం అయింది. కొద్ది రోజులుగా పాఠశాలలు, కళాశాలలకు పిల్లలు వెళ్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, యూనిఫామ్స్, ప్రయాణ ఖర్చులకు ఇచ్చేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోయిందని, అప్పు చేసి పిల్లలను చదివించుకోవాల్సిన పరిస్థితి నెలకొందంటూ ఫీల్డు అసిస్టెంట్లు వాపోతున్నారు. కుటుంబ పోషణకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నామంటూ ఆవదేన వ్యక్తంచేస్తున్నారు.

తక్షణమే సర్వీసును రెన్యువల్ చేయాలి

ఫీల్డ్ అసిస్టెంట్స్ ఉద్యోగాల కాంట్రాక్టును ఏటా రెన్యువల్ చేయాలి. ఈ ఏడాది ఇంతవరకు రెన్యూవల్ చేయలేదు. దీని వల్ల మాకు మూడు నెలలుగా జీతాలు రాలేదు. పాఠశాలలు తెరిచారు. వారికి ఫీజులు కట్టడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఇటీవల వీటికోసం నిరసన కూడా చేపట్టాం. అధికారులను జీతాలు గురించి అడిగితే వారం రోజుల్లో పడతాయని అంటున్నారు.

– ఎస్.రాజారావు, ఫీల్డ్ అసిస్టెంట్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపించాం

ఫీల్డ్ అసిస్టెంట్స్ రెన్యువల్, జీతాలు గురించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే జీతాలు చెల్లిస్తాం.

– ఎస్.శారదాదేవి, పీడీ, డ్వామా

ఇదెక్కడి ‘సాక్ష్యం’..!

- మెగాపేరెంట్స్ మీటింగ్ పర్యవేక్షణ బాధ్యతలు వేరొక శాఖ ఉద్యోగికి అప్పగింత
- దీనిని వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- 2,235 ప్రభుత్వ ఉద్యోగుల విధులు గాలికి
- చిన్న గ్రామాల్లో ఉద్యోగుల లభ్యతే ప్రశ్నార్థకం

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10న నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌పై వేరొక శాఖకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి పర్యవేక్షణ తప్పనిసరి అంటూ విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. మీటింగ్ సందర్భంగా సాక్షిగా ఉన్న ఉద్యోగి తీసిన ఫొటోలు, సమాచారం అన్నీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉపయోగిస్తున్న యాప్‌లో అదే రోజున అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నిబంధనను ఉపాధ్యాయ సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాల్లో అనేక అనుమానాలు, ఉపాధ్యాయులను ఆందోళన, అగౌరవ పరిచే అంశాలున్నాయంటూ మండిపడుతున్నారు.

2,235 ప్రభుత్వ ఉద్యోగుల విధులు గాలికి!

జిల్లాలోని వివిధ యాజమన్యాల పరిధిలో 2,235 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యాశాఖ నిబంధనల మేరకు తల్లిదండ్రుల సమావేశాల పర్యవేక్షణకు ఒక్కో పాఠశాలకు ఒక ఉద్యోగి అవసరం. వారు తమ శాఖాపరమైన ఉద్యోగ విధులను మానుకొని వారికి కేటాయించిన పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో 40 నుంచి 50 ఇళ్లతో కూడిన చిన్న చిన్న గ్రామాలు ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లోని పాఠశాలల్లో జరిగే సమావేశాల పర్యవేక్షణకు ఇతర శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండడం ఎంతవరకు సాధ్యమవుతుందన్న ప్రశ్నను ఉపాధ్యాయ సంఘాల నాయకులు లేవనెత్తుతున్నారు. ఇప్పటికే లైవ్ వీడియో, ఫొటో అప్‌లోడ్ చేయాలన్న ఆదేశాలను వ్యతిరేకిస్తుండగా, కొత్త నిబంధనలు ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

అంగీకరించేది లేదు: పీఆర్‌టీయూ జిల్లా కమిటీ

ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌పై ఇతర శాఖల ఉద్యోగులను పర్యవేక్షణగా వేయాడాన్ని అంగీకరించేది లేదని పీఆర్‌టీయూ జిల్లా కమిటీ ప్రకటించింది. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజల సహకారంతో సమావేశాలను విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో బాహ్యపరిశీలకులపేరిట ఇతర శాఖ ఉద్యోగుల నియమించడం పాఠశాల నిర్వహణ వ్యవస్థ, ఉపాధ్యాయుల పరితీరు కించపరిచేలా ఉంది. అటువంటి చర్యలను వెంటనే ఉపసంహరించాలంటూ పీఆర్టీయూ జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్, ఆర్.రాంబాబు, బంకపల్లి శివప్రసాద్ డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల మీటింగ్‌ల పర్యవేక్షణ బాధ్యతలను ఇతర శాఖల ఉద్యోగులకు అప్పగించడమంటే ఉపాధ్యాయలోకాన్ని కించపరచడమేనని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి పేర్కొన్నారు.

వ్యవసాయాభివృద్ధితోనే జీడీపీ వృద్ధి

● కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వ్యవసాయాభివృద్ధితోనే జీడీపీ వృద్ధి చెందుతుందని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనతో పంటలకు బీమా రక్షణ కల్పించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. అనుకోని విపత్తు సంభవించినప్పుడు ఈ పథకం రైతులను ఆదుకుంటుందన్నారు. కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశాలను శనివారం నిర్వహించారు. పంట బీమా పథకం అమలు, వివిధ పథకాలకు బ్యాంకు రుణాల మంజూరు, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై తదితర బీమా పథకాలు, పంట రుణాలు, కౌలుదారులకు గుర్తింపు కార్డులు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు లీడ్‌బ్యాంక్, వ్యవసాయశాఖ ప్రచురించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బీమా యోజన రైతుకు భరోసా కల్పిస్తుందని, ప్రతీ రైతు వినియోగించుకునేలా చైతన్యపరచాలన్నారు. ఎకరాకు వరి పంటకు రూ.200, మొక్కజొన్నకు రూ.165, నువ్వు పంటకు రూ.65, పత్తి పంటకు రూ.1,923 బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ జేడీలు వీటీ రామారావు, డాక్టర్ వైవీ రమణ, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, నాబార్డు డీడీఎం నాగార్జున, డ్వామా పీడీ శారదాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టేషన్ల వారీగా పటిష్ట సమాచార వ్యవస్థ

● ఎస్పీ వకుల్ జిందల్



విజయనగరం క్రైమ్: స్టేషన్ల వారీగా పటిష్ట సమాచార వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్‌బ్రాంచి సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల పనితీరు క్రియాశీలకమన్నారు. ఎస్బీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ముందస్తుసమాచారం సేకరించేందుకు సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ వివాదాలు, కక్షలు, భూతగాదాలు, గ్రూపుల గురించి సమాచారం ముందస్తుగా సేకరించాలన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటిని ముందుగా గుర్తించి, సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. తద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతికతను వినియోగించుకొని ప్రతీ అంశం పట్ల విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకునేందుకు స్పెషల్ బ్రాంచ్ పోలీసు సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ, ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎస్బీ సీఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఎస్ఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బొత్సకు బొబ్బిలి వీణను బహూకరిస్తున్న తూముల దంపతులు

● శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



శంబంగితో మాట్లాడుతున్న బొత్స, కన్నబాబు

బొబ్బిలి:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు. అక్కడ నుంచి తిరిగివస్తూ బొబ్బిలిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బొత్స మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి ఏడాది గడచినా ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదు సరి కదా అన్నీ అమలు చేసేశాం అని, లేదని ఎవరయినా అంటే వారి నాలుక మందమని చంద్రబాబు అనడాన్ని ప్రజలు చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని కూటమి ప్రభుత్వం కోల్పోయిందన్నారు. ఖరీఫ్ ప్రారంభంలో రైతు భరోసా నిధులు ఇవ్వకపోతే మరెప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఇస్తామని ప్రజలకు హామీ ఇస్తే వెంటనే అమలులోకి తీసుకువచ్చిన ఘనత కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. స్థానిక పరిస్థితులను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శాసన మండలి విపక్ష నేతకు వివరించారు. తూముల భాస్కర రావు దంపతులు బొత్స సత్యనారాయణ, ఇతర నేతలకు బొబ్బిలి వీణలను బహుకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాల నాయుడు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తూముల అచ్యుతవల్లి, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వర రావు(విసు), స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో.. 1664 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పరిష్కరించిన కేసుల వివరాలు

కోర్టు పరిధి	పరిష్కారమైన కేసులు
విజయనగరం	473
పార్వతీపురం	119
బొబ్బిలి	69
సాలూరు	229
శృంగవరపుకోట	47
గజపతినగరం	347
చీపురుపల్లి	38
కొత్తవలస	320
కురుపాం	14
మొత్తం	1664

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: రాజీయే రాజమార్గమని, కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహపూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్‌అదాలత్ అని, దీనికి కక్షిదారుల నుంచి మంచి స్పందన రావడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.బబిత అన్నారు. జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడారు. కేసుల పరిష్కారం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదాతోపాటు మనశ్శాంతి కలుగుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో మొత్తం 1664 కేసులను పరిష్కరించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో నాల్గవశ్రేణి న్యాయమూర్తి బి.అప్పలస్వామి, మహిళాకోర్టు జిల్లా న్యాయమూర్తి ఎస్.పద్మావతి, పోక్సో కోర్టు, జిల్లా న్యాయమూర్తి కె.నాగమణి, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు భోజన సదుపాయం కల్పించారు.

● తరలిస్తారా.. చావమంటారా..?



కోళ్లఫారం తరలించాలంటూ పిల్లలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద బిరసాడవలస గిరిజనుల నిరసన

నివాసాల పక్కనే నిర్వహిస్తున్న కోళ్లఫారాల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం.. వ్యాధుల బారిన పడుతున్నాం.. పిల్లలకు తిండి సైతం సహించడం లేదు.. తక్షణమే ఇక్కడ నుంచి కోళ్ల ఫారాలను తరలించి జీవించే హక్కు కల్పిస్తారా? లేదంటే సామూహికంగా చావమంటారా? అంటూ బిరసాడవలస గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలంతా కలిసి మెంటాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన చేశారు. ఇప్పటికే 31 రోజులుగా నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సుపరిపాలనలో తొలిఅడుగు అంటూ మెంటాడలో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సైతం గిరిజనుల ఆందోళన, ఆవేదనను పట్టించుకోకుండా వెళ్లిపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. తక్షణమే కోళ్లఫారాలు తరలించాలని, లేదంటే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని గిరిజన నాయకులు సుకరయ్య, స్థానిక నాయకుడు రెడ్డి రాజప్పలనాయుడు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గిరిజనుల దీక్షశిబిరాన్ని పట్టించుకోకుండా వెళ్లిపోయిన మంత్రి తీరును తూర్పారబట్టారు.

– మెంటాడ

● గోతుల గండం.. నరక ప్రయాణం



చిత్రంలో పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తున్నది బొబ్బిలి నుంచి రాజాం వైపు వెళ్లే రోడ్డు. సుమారు 12 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. దీనిపై రాకపోకలకు వాహనదారులు నరకయాతన పడుతున్నారు. గోతుల్లో వాహనాలు కూరుకుపోతుండడంతో ప్రమాదాలబారిన పడుతున్నారు. సంక్రాంతికి రోడ్లను అద్దంలా తీర్చుదిద్దుతామని హామీ ఇచ్చిన కూటమి నేతల మాటలు పచ్చిఅబద్ధాలని చెప్పేందుకు ఈ రోడ్డే నిదర్శనమంటూ ఈ ప్రాంతీయులు విమర్శిస్తున్నారు. కనీసం గోతులు పూడ్చే పనులైనా చెపట్టాలంటూ కోటలో కాలంవెళ్లదీస్తున్న పాలకులకు వినిపించేలా నినదిస్తున్నారు.

– బొబ్బిలిరూరల్

మంత్రి ఇలాకాలో ఎరువు కరువు

ఈ చిత్రం చూశారా... వర్షంలో గొడుగులు వేసుకుని ఉన్నది రైతన్నలు. పత్తి, మొక్కజొన్న, వరి నారుకు వేసేందుకు అవసరమైన ఎరువుకోసం సాలూరు మండలం శివరాంపురం పీఏసీఎస్ వద్ద శనివారం ఉదయం 6 గంటల నుంచి క్యూ కట్టారు. వారిలో సగం మందికి కూడా ఎరువు అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అదునుకు ఎరువు అందించకపోతే ఎలా అంటూ అధికారులను నిలదీశారు. కూటమి ప్రభుత్వ తీరును దుమ్మెత్తిపోశారు. మంత్రి సంధ్యారాణి రైతన్నల ఎరువు కష్టాలను పట్టించుకోవడంలేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.



గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు ఎంత ఎరువు కావాలంటే అంతమేర ఆర్‌బీకేల ద్వారా సరఫరా అయ్యేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదంటూ వాపోయారు.

– సాలూరు రూరల్

క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి 'చేయూత'



ఏఆర్ కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సత్తిబాబు కుటుంబానికి పోలీసు శాఖ చేయూత కింద రూ.1,47,300ల విలువైన చెక్‌ను ఎస్పీ వకుల్ జిందల్ శనివారం అందజేశారు. ఈ మేరకు తన చాంబర్‌లో సత్తిబాబు భార్య బి.రాజేశ్వరికి దీన్ని అందజేశారు. సిబ్బంది ఈ మొత్తాన్ని సేకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మృతి చెందిన సిబ్బంది కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణంలో దొంగతనంపై ఆరా తీస్తున్న ఏఎస్ఐ

సంతకవిటి: మండల కేంద్రంలోని జీపీ వైన్స్‌లో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. పోలీసులు, దుకాణ యాజమాన్యం తెలిపిన వివరాలు.. మద్యం దుకాణం వెనుకన ఉన్న గోడకు శుక్రవారం రాత్రి కన్నం చేసి దొంగలు లోపలికి ప్రవేశించారు. తొలిత సీసీ కెమెరాను తప్పించి హార్డ్ డిస్క్‌తో పాటు రూ.14వేల నగదు, రూ.24 వేల విలువ చేసే మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం దుకాణం తెరిచిన సిబ్బంది చోరీ జరిగినట్టు గుర్తించి యాజమాన్యంకు తెలిపారు. దీంతో యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ వాసుదేవరావు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

లారీ బోల్తా పడి ట్రాఫిక్ జామ్



లారీని క్రేన్‌తో పక్కకు తప్పిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామ సమీపంలో బొగ్గు లారీ శనివారం బోల్తా పడడంతో విశాఖ, రాయగడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 8 గంటల సమయంలో బొబ్బిలి నుంచి విశాఖ వైపు వెళుతున్న బొగ్గు లారీ అదుపుతప్పి పారాది గ్రామ సమీపంలో బోల్తా పడింది. అప్పుడే విశాఖ నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ దానిని తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న బురదలో చిక్కుకు పోయింది. దీంతో విశాఖ, రాయగడ వైపు వెళ్లే రహదారిలో అటు రామభద్రపురం, ఇటు గ్రోత్ సెంటర్ వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా రాకపోకలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ సతీష్ కుమార్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు యధావిధిగా రాకపోకలు కొనసాగాయి.

ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు



కురుపాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

గుమ్మలక్ష్మీపురం: ఒడిశా ప్రాంతం పిప్పలభద్ర ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడిన ప్రమాదంలో మండలంలోని కొండుకుప్ప, మూలిగూడ గ్రామాలకు చెందిన పలువురు గాయాలపాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాలోని రాయగడలో జరుగుతున్న రథయాత్రకు పై గ్రామాలకు చెందిన సుమారు 17 మంది ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలోని పిప్పలభద్ర ఘాట్ రోడ్డు వద్ద ఆటో అదుపు తప్పి సైడ్ వాల్‌కు ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొండుకుప్పకు చెందిన పత్తిక సుమంతి, పత్తిక మన, జయంతితో పాటు మూలిగూడకు చెందిన పత్తిక శ్రీరాం, జీలకర్ర సరితలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వైద్య నిమిత్తం క్షతగాత్రులను కురుపాం ఆసుపత్రికి తరలించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹78	₹166	₹176

పెంపకం.. కావాలి అప్రమత్తం..!


- పెంపుడు జంతువులపై పెరుగుతున్న ఆసక్తి
- జంతు సంక్రమిత వ్యాధులు వచ్చే అవకాశం
- పెంపకంపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ జునోసిస్ డే

రాజాం సిటీ/వేపాడ/గుమ్మలక్ష్మీపురం:

మానవ జీవనంలో జంతువులు సైతం భాగమయ్యాయి. మనిషి తన అవసరాల కోసం కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లు ఇలా రకరకాల జంతువులను పెంచుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. నేడు ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ...

పెరుగుతున్న ప్రేమ..

జంతు ప్రేమ రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రేమనైతే పంచుతున్నారుగాని వాటితో కలిగే వ్యాధుల గురించి పట్టించుకోవడంలేదు. వైద్య నిపుణుల పరిశోధన ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలా సోకే వ్యాధులను జునోసిస్ అంటారు. కుక్క కాటు ద్వారా రేబిస్, పందుల ద్వారా మెదడు వాపు, పశువులు, గొర్రెల నుంచి టీబీ వ్యాధులు సంక్రమిస్తాయని, వీటన్నింటిలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనదిగా వైద్యులు పేర్కొంటున్నారు.



ఇటువంటి కుక్క పిల్లలకు టీకాలు తప్పనిసరి

జునోసిస్ ఎలా వచ్చిందంటే...

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి. పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేబిస్ టీకాను ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడంతో ఆ రోజున ప్రపంచ జునోటిక్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

పిల్లల విషయంలో జాగ్రత్త...

పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి.

వ్యాక్సినేషన్ వేయించాలి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొంతమంది ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. పెట్స్‌కు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దాని వల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లులు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను జునాటిక్ డిసీజస్ అంటారు. ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడు వాపు వంటివి జునోటిక్ వ్యాధులే. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్‌గా వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో కుక్కలు పెంపకం చేపట్టిన వారు చర్మ సమస్యలు వస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు.

– డాక్టర్ బి.జయప్రకాష్, ఏడీ, పశుసంవర్ధకశాఖ, రాజాం

కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: పోలీసు శాఖలో క్రియాశీలకమైన స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో జి ఎస్పీ మాధవ్ రెడ్డి శనివారం తన కార్యాలయంలో సమావేశమై వారు క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఎస్‌బీ నిర్వహించాల్సిన విధులపై కొన్ని మార్గదర్శకాలు చేశారని డీజీపీ ఆలోచనల మేరకు జిల్లాలో వాటిని పరిగణనలోకి తీసుకొని జిల్లా ఎస్‌బీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) పోలీసుల పనితీరు చాలా క్రియాశీలకమన్నారు. కచ్చితమైన సమాచారాన్ని సేకరించేందుకు సోర్సు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వారితో మమేకమై అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. సేకరించిన విషయాలను రికార్డు రూపంలో భద్రపరుచుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.

కార్యకలాపాలపై మరింత దృష్టి

గ్రామ, వార్డు స్థాయిలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, రాజకీయ వివాదాలు అతిథుల రాకపోకల సమాచారం వారియొక్క ప్రతీ కార్యక్రమం, ధర్నాలు, కక్షలు, భూ తగాదాలు, మత సంబంధమైన గ్రూపుల యొక్క సమాచారం ముందస్తుగా సేకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముందుగా గుర్తించి ఆ సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రజలతో నిత్యం మమేకమవుతూ పక్షపాతి ధోరణి లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ రంగనాథం, ఎస్‌బీ ఎస్సీఐ రమేష్, ఎస్ఐలు దినకర్, రాజు, శంకరరావు, ఇతర పోలీసు అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి ప్రతిభ

- ట్రిపుల్ గోల్డ్ చాంపియన్‌గా నిలిచిన భవాని



సాధించిన బంగారు పతకాలతో వెయిట్‌లిఫ్టర్ భవాని

నెల్లిమర్ల రూరల్/విజయనగరం: కజఖస్తాన్‌లో ఈ నెల 4 నుంచి జరుగుతున్న ఏషియన్ జూనియర్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి సత్తా చాటింది. విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామానికి చెందిన రెడ్డి భవాని శనివారం నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఒకేసారి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకుంది. స్నాచ్‌లో 69 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కేజీలు..మొత్తంగా 159 కేజీల బరువును లేపి ట్రిపుల్ గోల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణికు రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు బెల్లాన లక్ష్మి, కోచ్ చల్లా రాము, గ్రామస్తులు అభినందించారు.

లోక్ అదాలత్‌లో 116 కేసుల రాజీ



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 116 కేసులను ఇరువురు అంగీకారంతో రాజీ చేసినట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి మార్గదర్శిగా ఉపయోగపడుతుందన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో సుమారు రూ.18,24,808ల విలువైన కేసులలో రాజీ చేసినట్టు వివరించారు. అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యా జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, బార్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు



సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు ఉన్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ కుటుంబాలను మార్గదర్శితో సమన్వయం చేయాలని ఆయనన్నారు. ప్రభుత్వం బంగారు కుటుంబాలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసిందన్నారు. శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించి, కుటుంబాన్ని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి నిబద్ధతతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్‌లు జిల్లాలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబం, మార్గదర్శి మధ్య అంతరాన్ని పూడ్చడానికి అధికారిక బృందం స్ఫూర్తితో పని చేయాలన్నారు. యోగాంధ్రలో జిల్లా బృందం చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. జిల్లాను ఒక నమూనాగా ఉంచడానికి మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమంలో అదే స్ఫూర్తితో పని చేయాలని ఆయన కోరారు. మనస్సుతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇళ్లను మార్గదర్శితో మ్యాప్ చేయాలని ఆయనన్నారు. పనిని పర్యవేక్షించడానికి సిబ్బందిలో ఒకరిని కన్వీనర్‌గా నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారని ఆయన అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మాట్లాడుతూ పీ4 వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు, ఆర్‌బీఎస్‌కె ప్రాజెక్టు అధికారి డా. టి.జగన్‌మోహన్‌రావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు, ఈపీడీసీఎల్ కార్య నిర్వాహక ఇంజినీర్ కె.వేణుగోపాల్‌నాయుడు, గ్రామీణ నీటి సరఫరా విభాగం డిప్యూటీ డీఈ రెడ్డి పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో. జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 10వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శనివారం ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 2,232 పాఠశాలల నుంచి 2,10,377 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ సమావేశాలను నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. జిల్లాలోని 180 జూనియర్ కళాశాలల నుంచి 38,478 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సహా హాజరు కావాలన్నారు. పిల్లలే ఆహ్వానాలను తల్లిదండ్రులకు అందిస్తారని, ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్‌ను కూడా ఇస్తారని ఆ ఫార్మాట్‌పై వారి అభిప్రాయాన్ని రాసి ఇస్తారని పేర్కొన్నారు. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 17 కమిటీలను నియమించడం జరుగుతుందని జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

రూ.4.67 కోట్లతో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులు

జిల్లాలోని 23 సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మత్తులకు రూ.4.67 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమావేశాన్ని నిర్వహించి పనుల ప్రగతిపైన, విద్యార్థుల హాజరు శాతంపైనా సమీక్షించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం.అన్నపూర్ణ, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, వసతిగృహాల సంక్షేమాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఏం కష్టం వచ్చిందో..

- రాజాంలో కొప్పర యువకుడి ఆత్మహత్య
- కడుపు నొప్పి భరించలేకనే ఈ ఘోరం అంటూ తండ్రి ఫిర్యాదు
- మృతుడి వద్ద సూసైడ్ నోట్ లభ్యం



రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న శ్రీనివాసరావు

రాజాం సిటీ : 'తాతయ్య, అమ్మ, నాన్న అందరూ నన్ను క్షమించండి. నేను ఒక సమస్యలో ఇరుక్కున్నాను.. అందువల్ల ఇలా చేస్తున్నాను.. ఇందులో నా తప్పు లేదు.. ఎవరినీ మోసం చేయలేదు.. నేను చేసిన తప్పుకు ఇదే పరిష్కారం.. నన్ను క్షమించండి.. పవన్ జాగ్రత్తగా ఉండు.. ఎవరి దగ్గరా మోసపోవద్దు.. తాతయ్య, అమ్మ, నాన్న, అక్కను జాగ్రత్తగా చూసుకో.. నేను లేని లోటు నువ్వు తీర్చు.. అందర్ని జాగ్రత్తగా చూసుకో...'

ఇది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునే ముందు తన కుటుంబీకులకు రాసిన సూసైడ్ నోట్.

ఏం కష్టం వచ్చిందో తెలియదుకానీ ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు సరైన కారణాలు తెలియరానప్పటికీ మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజాం పట్టణ ఎస్ఐ వై.రవికిరణ్‌తో పాటు స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంగర మండలం కొప్పర గ్రామానికి చెందిన బూరి శ్రీనివాసరావు(29) రాజాం పట్టణంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా జాబ్ చేస్తున్నాడు. ఈయన బీటెక్ పూర్తి చేసి, ఉన్నత ఉద్యోగాలు నిమిత్తం ప్రయత్నిస్తున్నాడు. ఇంటికి తను భారంగా ఉండకూడదని భావించి ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. 15 రోజుల క్రితం రాజాం పట్టణంలో తెలగవీధిలోని నివాసముంటున్న తన స్నేహితులు వద్దకు వచ్చి ఇక్కడే రూమ్‌లో ఉంటున్నాడు. ఇదే సమయంలో వ్యక్తిగత పనుల నిమిత్తం రెండు రోజుల క్రితం అతని స్నేహితులు బయటకు వెళ్లారు. ఇంతలో శ్రీనివాసరావు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో అతని తండ్రి నారాయణరావుకు అనుమానం వచ్చింది. తన కుమారుడు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని అతని స్నేహితులకు నారాయణరావు ఫోన్ చేయగా, వారు వచ్చి చూడగా గదిలో ఫ్యాన్‌కు శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఉన్నాడు. ఈ విషయాన్ని వెంటనే అతని తల్లిదండ్రులతో పాటు పోలీసులకు స్నేహితులు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు తండ్రి నారాయణరావుతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుమారుడి మృతిని జీర్ణించుకోలేక నారాయణరావు సొమ్మసిల్లిపడిపోయాడు. తన కుమారుడు కొద్ది నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడని, ఈమేరకు గ్రామంలో నాటు వైద్యం కూడా చేయించుకుంటున్నాడని పోలీసులకు తెలిపాడు. రాజాం వచ్చి ఉంటున్న తన కుమారుడు ఫోన్ ఉదయం స్విచ్ ఆఫ్ చేసి రావడంతో అనుమానం వచ్చి అతని స్నేహితులకు సమాచారం ఇచ్చామని, ఇంతలోనే ఈ దుర్వార్త వినాల్సి వచ్చిందని వాపోయాడు. శ్రీనివాసరావు వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పరిశీలించి, అందులోని విషయాలు ఆధారంగా ఆరా తీస్తున్నారు. ఏదైనా మోసానికి గురై శ్రీనివాసరావు మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. శ్రీనివాసరావు ఉరి వేసుకుని ఒక రోజు దాటి ఉండవచ్చుననే అనుమానం వ్యక్తం చేశారు. రాజాం ఏరియా ఆసుపత్రిలో శవ పంచనామా అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

కొప్పరలో విషాదం

వంగర : మండలంలో కొప్పర గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన బూరి శ్రీనివాసరావు రాజాం పట్టణంలో తన స్నేహితులు గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడన్న విషయం తెలియగానే గ్రామం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. శ్రీనివాసరావు మృతదేహం గ్రామానికి చేరుకోగానే తల్లిదండ్రులు మజ్జిగౌరి, నారాయణరావులతో పాటు సోదరుడు పవన్‌కళ్యాణ్‌లు కన్నీరుమున్నీరుగా రోదించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్న విజిలెన్స్ అధికారులు

పాలకొండ రూరల్: అక్రమంగా తరలిపోతున్న పీడీఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులు మెరుపు దాడితో పట్టుకున్నారు. ఆ శాఖ ఎస్ఐ రామారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం నుంచి ఓ వ్యాన్‌లో ఒడిశాకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం అక్రమంగా తరలిపోతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. దీంతో అధికారులు ఆ రహదారిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. పాలకొండ కార్గిల్ పాయింట్ వద్ద గల మార్కెట్ కమిటీకి చెందిన చెక్‌పోస్టు వద్ద మాటు వేసిన విజిలెన్స్ అధికారులు వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టుబడ్డాయని తెలిపారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.లక్ష 7వేల వరకూ ఉంటుందని అధికారులు లెక్క కట్టారు. పట్టుబడిన వాహనం సీజ్ చేయటంతో పాటు అందులో తరలించే యత్నం చేసిన బియ్యం బస్తాలను స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పజెప్పామని ఎస్ఐ తెలిపారు. ఆ శాఖ సిబ్బంది లక్ష్మీనారాయణ, కన్నబాబు, శ్రీనుబాబు తదితరులున్నారు.

గోరపాడులోనే ఏనుగులు

సీతంపేట: గోరపాడు సమీపంలోనే ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల గ్రామాల్లో నివాసముంటున్న గిరిజనులకు కంటి మీద కునుకు లేకుండా ఉందని స్థానికులు తెలిపారు. ఎప్పుడు ఏ క్షణాన గ్రామంలోకి వచ్చేస్తాయోమోనని ఆందోళన చెందుతున్నారు. కొండపోడు పనులకు సైతం నాలుగు రోజులుగా వెళ్లడం లేదని గిరిజనులు తెలిపారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ కె.దాలినాయుడు ఆధ్వర్యంలో ట్రాకర్లు ఏనుగులు గమనాన్ని పరిశీలించి అటువైపు వెళ్లకుండా గిరిజనులను నియంత్రిస్తున్నారు.

7న గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గురుకుల బాలురు, బాలికల పాఠశాలలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల మిగులు సీట్ల భర్తీకి సంబంధించి కౌన్సెలింగ్‌ను ఈ నెల 7వ తేదీన నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో చేపట్టనున్నామని ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త ఎస్.రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు చెందిన విద్యార్థులకే ఈ కౌన్సెలింగ్ అవకాశం ఉందని ఆమె స్పష్టం చేశారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు బాలికలకు, మధ్యాహ్నం 1 గంటకు బాలురు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం, పదవ తరగతి విద్యార్థులైతే మార్కుల జాబితా తదితర పత్రాలతో హాజరు కావాలని ఆదేశించారు.

పోలీసులకు చిక్కిన గంజాయి నిందితుడు

విజయనగరం క్రైమ్: నగరంలోని అయ్యన్నపేట వద్ద గల వాకింగ్ ట్రాక్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి గంజాయితో వన్‌టౌన్ పోలీసులకు చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. వాకింగ్ ట్రాక్ వద్ద ఓ వ్యక్తి అనుమానితంగా సంచరిస్తుండడాన్ని ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ శనివారం గుర్తించారు. ఆయన వద్ద ఒక కత్తి, తపంచా ఉండడాన్ని చూసి ప్రశ్నించడంతో పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఎస్ఐ పట్టుకొని సోదా చేయగా మూడు కేజీల గంజాయి ప్యాకెట్లు అతని వద్ద లభ్యమయ్యాయి. ఈ వ్యక్తిని విజయనగరం ఎల్‌బీజీ నగర్‌కు చెందిన మజ్జి కృష్ణవర్ధన్‌గా గుర్తించారు. రాయఘడ నుంచి గంజాయి కొనుగోలు చేసి విజయనగరంలో విక్రయించేందుకు సిద్ధపడ్డాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ నిందితుడిని విచారించారు. కత్తి, తపంచా, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఇతనిపై గతంలో రౌడీషీట్ ఉందని సీఐ చెప్పారు.